ప్రజాశక్తి

మంగళవారం 18 జూన్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

వ్యవసాయం కోసం..

- పెట్టుబడుల కోసం రైతు గాబరా
- పెరిగిన ఖర్చులతో భారంగా సాగు



నారుమడిలో నారును సిద్ధం చేస్తున్న కూలీలు (ఫైల్)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్ ప్రారంభం నేపథ్యంలో గతంలో నష్టాలు మిగిల్చిన అప్పులు.. ఈ ఏడాది పెట్టుబడి కోసం అవసమైన సొమ్ములను లెక్కలేసుకుంటూ రైతులు గాబరా పడుతున్నారు. తమది రైతు ప్రభుత్వమని అన్ని ప్రభుత్వాలు చెబుతున్నా ఆచరణలో రైతులకు మొండిచేయే మిగిలుతోంది. ప్రభుత్వాల విధానాల కారణంగా పెరుగుతున్న ఖర్చులు ఒకవైపు, మద్దతు ధరలు పెంచని తీరు మరోవైపు రైతులను ప్రతిఏడూ నష్టాల్లోనే నడిపిస్తున్నాయి. దీనికి తోడు ప్రకృతి విపత్తులు, చీడపీడలు మరింతగా కుంగదీస్తున్నాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు సాకులతో కాలం వెళ్లబుచ్చుతుండగా రైతులు వ్యవసాయ కాడిని మోయలేక మోయాల్సిన దుస్థితిలో నెట్టబడ్డారు.

పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 8,33,625 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనా. నీటి లభ్యత సరిగా ఉంటే 1,93,750 ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేస్తున్నారు. నీటి లభ్యత ఆశించిన మేర లభిస్తే వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనికి తగ్గట్లు వరి విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యేలా ▶ 2లో

ఎకరా వరి సాగుకు ఖర్చు (సుమారుగా)

దుక్కి : రూ.1600
నారుమడి, విత్తనాలు : రూ.3000
దమ్ము చేయడం : రూ.3000
నాట్లు వేసేందుకు రూ.3000
కలుపు తీత : 3000
ఎరువులు : రూ.10000
పురుగు మందులు : రూ.6000
కూలీల ఖర్చు : రూ.4000
నూర్పిడి : రూ.3000
సంచులు : రూ.1500
ధాన్యం తరలింపు : రూ.1900
మొత్తం : రూ.40 వేలు
కౌలురైతులైతే అదనంగా కౌలు చెల్లించాలి

మిర్చి లారీ దగ్ధం - రూ.20 లక్షల నష్టం

ప్రజాశక్తి - సత్తెనపల్లిరూరల్

మిర్చి లోడుతో వెళుతున్న లారీ దగ్ధమైన ఘటన రాజుపాలెం మండలం అనుపాలెం సమీపంలో సోమవారం జరిగింది. గుంటూరు నుండి మిర్చి లోడుతో మహారాష్ట్ర వెళుతున్న లారీకి మధ్యాహ్నం వేళ చౌటపాపాయపాలెం -అనుపాలెం గ్రామాల మధ్యకు రాగానే మంటలు వ్యాపించాయి. సాంకేతిక కారణంగా లారీ లోనుంచి ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.20 లక్షలు విలువ చేసే 300 మిర్చి బస్తాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న సత్తెనపల్లి అగ్నిమాపక సిబ్బంది లారీ వద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు.



రాజుపాలెం ఎఎస్ఐ పుల్లారావు ఘటనా స్థలిని పరిశీలించి లారీ డ్రైవర్ మహేష్ నుండి వివరాలు సేకరించారు. లారీ ఇంజన్‌లోవైరింగ్ కిట్టు కాలడం వల్ల మంటలు వ్యాపించి ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.

రజకులకు సామాజిక చట్టం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేసి, రజక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సోమవారం పాతగుంటూరులోని సంఘ కార్యాలయంలో మండూరు వెంకట నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదేళ్లలో రజకులపై అగ్రవర్ణ పెత్తందారులు అనేక దాడులు, దౌర్జన్యాలు చేశారని, అక్రమ కేసులు బనాయించారన్నారు. రజకుల రక్షణకు వెంటనే సామాజిక రక్షణ చట్టం చేసి, రజకుల అభివృద్ధి-సంక్షేమ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రజకుల అభ్యున్నతికి కృషి చేస్తామని, 50 ఏళ్ల నిండిన రజక వృత్తిదారులందరికీ పింఛను మంజూరు చేస్తామని, ఆదరణ పథకం ద్వారా రజకులకు వృత్తి నిర్వహణలో తోడ్పాటు అందిస్తామని కూటమి ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ▶ 2లో

ఇకపై ఆ దారిన అందరూ వెళ్లొచ్చు!

మాజీ సిఎం జగన్ నివాస మార్గంలో ఆంక్షల సడలింపు, సెక్యూరిటీ తగ్గింపు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలోని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లే రోడ్డు మూడంచెల భద్రతతో కూడుకుని ఉంటుంది. బయట వారు ఎవరూ ఆ మార్గం గుండా వెళ్లలేని పరిస్థితులు. మంత్రులు, ఉన్నత అధికారులు, ఎమ్మెల్యేలు మినహా ఆ రోడ్డువైపు మరొకరు వెళ్లలేని పరిస్థితి. ఇది నిన్నటిదాకా. నేడు పరిస్థితి మారిపోయింది. ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓడిపోవడంతో జగన్ ఇంటి వద్ద



పోలీస్ భద్రతను తగ్గించారు. రోడ్డుపై అందరికీ రాకపోకలకు అవకాశం కల్పించారు. ప్రభుత్వం పోలీసు ▶ 2లో



గుంటూరులో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

బక్రీద్ సందర్భంగా నగరంలోని ఉర్దూ హైస్కూల్ ప్రాంగణం, ఆంధ్రా ముస్లిమ్ కాలేజీలోని ఈద్గాల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో పాల్గొన్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ త్యాగానికి బక్రీద్ ప్రతీక అన్నారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని నింపటమే బక్రీద్ సారాంశమని చెప్పారు. ప్రజలందరూ సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, నంబూరు సుభాని, టిడిపి నాయకులు గౌస్, షేక్ బాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

విజయపురి సౌత్



వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అభివృద్ధికి తొలి మార్గంగా భావించే విద్యారంగంలో మార్పు కోసం పల్నాడు ఎదురు చూస్తోంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో మణిమకుటాల్లా వెలుగొంతుతున్న పాఠశాలలు సైతం ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నారు. రెండు వేల మంది విద్యార్థులను ఒడిలో చేర్చుకున్న పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాల, 1100 మందికి విద్యనందిస్తున్న దాచేపల్లి జెడ్‌పి పాఠశాల, వెయ్యి మందికిపైగా విద్యార్థులున్న బ్రాహ్మణపల్లి జెడ్‌పి పాఠశాలలు సైతం ఉపాధ్యాయుల కొరతతో భర్తీ కోసం నిరీక్షిస్తున్నాయి.

పల్నాడు ప్రాంతంలో వ్యవసాయ అధారిత కుటుంబాలు అధికంగా ఉంటాయి. రోజు పని చేసుకుంటేనే కాని పూటగడవని కుటుంబాలే ఈ ప్రాంతంలో అధికం. ఈ కుటుంబాల్లోని వారంతా తమ పిల్లలను ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. అయితే ఆ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక



టీచర్ల కోసం గురజాల్లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

ఉత్తీర్ణత శాతం పడిపోతుండడంతో చాలా మంది తమ పిల్లల్ని పంపించడం ఆపేస్తున్నారు. ఆర్థికంగా కష్టమైనా ప్రైవేటు పాఠశాలలకు పంపేందుకు సిద్ధమవుతుండగా కొంతమంది తమ పిల్లల్ని చదువులు మాన్పించి పనులకు తీసుకెళ్తున్నారు. ఉత్తీర్ణత శాతం తగ్గడానికి ప్రధాన కారణంగా ఉపాధ్యాయుల కొరత అనే వాదన వినిపిస్తోంది.

ప్రభుత్వ నిభందనల ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. కాని గురజాలలోని జెడ్‌పి పాఠశాలలో సుమారుగా 350 మంది విద్యార్థులు ఉండగా ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. అదే మండలంలోని తేలుకుట్ల జెడ్‌పి పాఠశాలలో 17 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ఏడుగురే ఉన్నారు. పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో రెండు వేల మంది విద్యార్థులుండగా నలుగురు హిందీ ఉపాధ్యాయుల పోస్టులు ▶ 2లో

రజకులకు సామాజిక చట్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే హామీల అమలు చేయాలని కోరారు. ఈనెల 29న గుంటూరు నగర రజక వృత్తిదారుల సంఘం మహాసభ కృష్ణ నగర్ ఒకటో లైన్‌లో నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. నగరంలోని రజక సోదరులందరూ, అపార్ట్మెంట్ వాచ్మెన్-కం-ఇస్త్రీదారులు అందరూ ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన విధివిధానాలను రూపొందించుకొని రాబోయే కాలంలో రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జా సుబ్బారావు, పాగోలు శ్రీనివాసరావు, వెంపాటి చిన్నకొండయ్య (సీతయ్య), అద్దంకి సాంబశివరావు, పేరుపాలెం రాంబాబు, భాస్కరరావు, ఫణిదపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇకపై ఆ దారిన అందరూ వెళ్లొచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

భద్రత కూడా ఎత్తివేసింది. చెక్‌పోస్టుల వద్ద బారికేడ్‌లను కూడా తొలగించారు. గతంలో అమరారెడ్డికాలనీ పేరుతో బకింగ్ హోమ్ కాల్వ పంపింగ్ స్కీమ్ నుంచి అరవింద స్కూల్ వరకు వందలాది మంది పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. సిఎం నివాసం ఇక్కడ ఏర్పాటైన తరువాత అక్కడున్న ఇళ్లను మొత్తం తొలగించారు. దీనికి బదులుగా ఆత్మకూరు వద్ద ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించారు. గతంలో సీతానగరం నుంచి బకింగ్ హోమ్ కాల్వ మీదుగా రేవేంద్రపాడు వరకు వెళ్లే ఈ కట్టను తాడేపల్లి బ్రిడ్జి నుంచి కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వరకు డబుల్ లైన్ రోడ్డు చేశారు. పాత కట్ట రోడ్డును అలాగే ఉంచారు. డబుల్ లైన్ రోడ్డు పక్కన భారీ ఎత్తున ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. గ్రీనరీ అభివృద్ధి చేశారు. ఈ దారిపై వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగించడంతో అరవింద హైస్కూల్ తదితర పాఠశాలలకు వెళ్లే బస్సులతో పాటు రేవేంద్రపాడు వరకు వెళ్లే వాహనదారులకు 1.5 కిలోమీటర్ల దూరం కలిసి వస్తుంది. మరోవైపు జగన్ నివాసం చూడటంతో పాటు కాల్వ కట్ట వెంట వేసిన గ్రీనరీ చూడటానికి స్థానికులు తరలివస్తున్నారు. జగన్ ఇంటి ముందు సెల్ఫీలు దిగుతున్నారు. ఉదయం పూట నడక కొనసాగించే వారికి కూడా ఈ దారి వినియోగించే వీలుంది. ఈ రోడ్డులో ఉన్న అపార్టుమెంట్ వాసులు కూడా గతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని నేడు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీగా ఉన్నాయి. దాచేపల్లి జెడ్‌పి పాఠశాలలో సోషల్, హిందీ, పీఈటీతోపాటు మరికొంతమంది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బ్రాహ్మణపల్లి జెడ్‌పి పాఠశాలనూ ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. గతంలో గురజాల మండలంలోని మాడుగలలో ఉపాధ్యాయులు కొరతతో ఇబ్బందుల పడ్డ విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఉపాధ్యాయుల కొరతను తీర్చడం ద్వారా చదువుల్లో నాణ్యతను పెంచి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా నూతన ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అసభ్యకరపోస్ట్‌లు చేసిన యువకుడికి రిమాండ్

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పరిచయమైన మైనర్ బాలికకు సంబంధించి అసభ్యకర ఫోటోలను పోస్ట్ కేసులో ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్లకు చెందిన మాలావత్ కల్యాణ్ కుమార్ నాయక్‌తో గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికతో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. తన ఫోటోలతో పాటు ఆ బాలిక ఫోటోలను కూడా అసభ్యకరంగా యువకుడు పోస్ట్ చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై బి.మహేంద్ర, ఆ యువకుడిని అరెస్టు చేశారు. తెనాలి కోర్టులో హాజరుపరచగా అతన్ని రిమాండ్‌కు తరలించారు.

భూమిని ఆరోగ్యంగా ఉంచితేనే..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

భూమిని ఆరోగ్యంగా ఉంచడం ద్వారానే ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్య చివరి ఏడాది విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు చెబుతున్నారు. రైతులతో మమేకమై వ్యవసాయ సాగులో విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకుంటున్నామని, రైతులతో మమేకమై అనుభవ పూర్వక వ్యవసాయ విధానంపై అధ్యయనం చేస్తున్నామని, కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విద్యకు రైతు అనుభవాన్ని జోడించి లాభసాటి వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానం, పంటల సాగు సరళిలో మార్పులు, భూసార పరిరక్షణ, విత్తనాల ఎంపిక సాగు విధానంపై బాపట్ల ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు అంటున్నారు. వ్యవసాయ విద్యలో భాగంగా రైతులతో మమేకమయ్యారు. నాలుగేళ్ల వ్యవసాయ విద్యలో భాగంగా చివరి ఏడాది క్షేత్ర స్థాయిలో వ్యవసాయ పంటల సాగు విధానంపై ప్రత్యక్ష అధ్యయనం కొనసాగిస్తు న్నారు. కొన్ని నెలల క్రితం మొదటి విడతలో 28 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రస్తుతం 2వ విడతలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా 27 మంది విద్యార్థులు 5 బృందాలుగా ఏర్పడి రొంపిచర్ల మండలం విప్పర్ల, రెడ్డిపాలెం, నకరికల్లు మండలం దేచవరం, రూపెనగుంట తదితర గ్రామాలలో ఉండి క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా వ్యవసాయ విద్యార్థుల బృందాన్ని 'ప్రజాశక్తి' పలుకరించింది. గ్రామంలో ఉంటూ వ్యవసాయ విద్యలో తాము నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించడంతో పాటు రైతులు నుండి మెలకువలు నేర్చుకుంటున్నారు. భూమిలో సేంద్రీయ కర్బనం సూక్ష్మ పోషకాల పెంపుదలకు చేపట్టాల్సిన చర్యలు రైతులకు వివరిస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

అధిక దిగుబడులు పొందలేకపోతున్నారు

ప్రస్తుతం గ్రామాలలో ఉంటూ భూసార పరీక్షలు, కార్బన్ వాడకంపై రైతులకు వ్యవసాయ విద్యార్థులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా భూమిలో, నీటిలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో ఎరువుల వాడకంలో సమతుల్యత కోల్పోయి నేల, నీరు కాలుష్యంగా మారుతున్నాయని, నేలలో ఉండి పంటలకు ఉపయోగపడే కొన్ని సూక్ష్మజీవుల శాతం క్రమంగా తగ్గిపోతోందని, ఫలితంగా అధిక దిగుబడులు రైతులు పొందలేకపోతున్నారని వివరించారు. శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపి నేలలో మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మ జీవుల శాతం పెంచాల్సిన అవసరం ఉందని తేల్చారని, దీనిని దష్టిలో ఉంచుకొని భూసారాన్ని అభివృద్ధి చేసేందుకు పశువులు, గొర్రెల ఎరువులు సూక్ష్మ పోషక ఎరు వులతో పాటు భూమిని సారవంతం చేయగలిగిన శ్రేష్టమైన సేంద్రీయ ఎరువైన కార్బన్‌ను రైతులకు మార్కెట్లో ప్రవేశ పెట్టిందని వివరించారు. కార్బన్ ను భూమిని దున్నేటప్పుడు లేదా మొక్కలు నాటేటప్పుడు మొక్కల పొదల్లో వేయవచ్చని రైతులకు సూచిస్తున్నారు. కార్బన్ నల్ల,ఎర్ర,ఇసుక, బంక భూములలో వాడవచ్చని కార్బన్ అందించడం ద్వారా నేల సారాన్ని పెంచుతుందన్నారు. కార్బన్ వలన నేలలు గుల్లబారీ మొక్క వేర్లు భూమి లోకి బాగా చొచ్చుకు పోతాయని నేలలో తేమశాతాన్ని పెంచి సూక్ష్మ పోషకాల అభివృద్ధికి తోడ్పడుతుందని, ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుతుందని, సుష్మ పోషకాలను మొక్కలకు అందు బాటులో తీసుకువచ్చి నేలను సారవంతం చేసి నాణ్యమైన దిగుబడి వస్తుందని రైతు లకు వివరించారు. సారవంతమైన భూము ల్లో నాణ్యమైన అత్యధిక దిగుబడులు సాధించేందుకు ఆస్కారం ఉంటుందని రైతులకు వివరిస్తున్నారు.

సారం తెలుసుకుంటే భారం తగ్గుతుంది



డాక్టర్ గురువుగారి రమేష్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త. రావిపాడు, నరసరావుపేట

భూసార పరీక్షల ఆధారంగా సాగు చేపట్టడం ద్వారా సాగు లో పెట్టుబడి తగ్గడంతో పాటు భూమిలో సారాన్ని సూక్ష్మ పోషకాల శాతాన్ని వృద్ధి చేసేందుకు అవకాశం ఉం టుంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 27 మంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామాల వారీ బృందాలుగా విడి పోయి రైతులతో కలిసి పంటల సాగును పర్యవేక్షించారు. రైతుల అనుభవాలు అడిగి తెలుసుకుంటున్నారు. కళాశాల విద్యార్థుల ద్వారా విషయపరిజ్ఞానాన్ని తెలుసుకొని గతాను భవాలను జోడించి లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేస్తామని రైతులు అంటున్నారు.

ఎన్నికల అనంతర హింసను అరికట్టండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఎన్నికల అనంతరం హింస యుత ఘట నలు జరగడం సరికాదని సామాజిక కార్యకర్త బైరి నరేష్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కొరటాల భవన్ లో రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరుగుతున్న దాడులను నిరసిస్తూ సామాజిక కార్యకర్త బైరి నరేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా కలిసి వచ్చే అన్ని ప్రజా సంఘాలతో ఎన్నికల హింస వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేశామని ప్రకటించారు.

మహిళపై దౌర్జన్యం.. కౌన్సిలర్ అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

మహిళపై దౌర్జన్యం చేసి ఆమె ఇంటి ఆక్రమణకు పాల్పడిన వైసిపి కౌన్సిలర్‌ను త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం మహిళ మల్లవరపు జయశ్రీ .. బాలాజీరావుపేటలో క్లినిక్ నిర్వహిస్తుంటారు. ఒకరికి సంబం ధించిన ట్రీట్మెంట్ విషయమై అపశృతి జరిగిందని ఆమెను ఆ వార్డు కౌన్సిలర్ మొఘల్ రహ్మత్ బేగ్ బెదిరించాడు. మరి కొంతమంది తన అనుచరులతో కలిసి ఆమెపై దాడి చేసి రూ.40 లక్షలు డిమాండ్ చేసి, తన ఒంటిపై ఉన్న బంగా రాన్ని లాక్కుని తాకట్టు పెట్టుకున్నారు. అంతేకాకుండా, ఇంటి పత్రాలు కూడా లాక్కుని, ఖాళీ కాగితాలపై,నోట్లపై తనతో బలవం తంగా సంతకాలు చేయించుకున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేని, నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

వ్యవ'సాయం' కోసం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు ప్రకటించారు.వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, చీడపీడల ఉధృతి నేపథ్యంలో ఎరువుల వాడకమూ అధికం కావడంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎకరా వరి సాగుకు సుమారు రూ.40 వేల వరకు ఖర్చవుతోంది. కౌల్దార్లయితే కౌలు ఖర్చులు అదనం. ఎకరాకు దిగుబడి సగటున 30-35 బస్తాల వరకు ఉంటుంది. ప్రస్తుతం కొత్త ధాన్యం రకాన్ని బట్టి రూ.1800-2200 ధర పలుకుతోంది. పాత ధాన్యం ధర పరిశీలిస్తే జెజెలు, బిపిటి రకం రూ.2800 వరకు ఉంది. ఈ లెక్కన ఆరు నెలలు కష్టించిన సొంత పొలం ఉన్న రైతుకు అన్నీ అనుకూలిస్తే మిగిలే ఆదాయం రూ.10 వేలు మాత్రమే. కౌల్దార్లకైతే ఇంకా నష్టం. సాగులో దాదాపు 70 శాతానికిపైగా కౌలురైతులే ఉన్నారు. నిత్యం నష్టాలతో వ్యవసాయం చేసే వీరికి ప్రభుత్వాలు దన్నుగా నిలవాలని, పెట్టుబడి సాయం, రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు ఇవ్వాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

సరైన మద్దతు ధరలుంటేనే మిగులు

తిరువీధుల వెంకయ్య, కౌలురైతు, అన్నవరం, రొంపిచర్ల, మండలం.



మా కష్ట పోను మిగులు కొంతైనా ఉండాలంటే పంటలకు సరైన మద్దతు ధర ఉండాలి. కోత సమయంలో వాతావరణం అనుకూలంగా ఉంటే రైతుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొనుగోలు చేసే దళారులు కానీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కానీ నాణ్యత బాగా లేదని ఇంకా ఏమైనా ఆంక్షలు విధిస్తే అప్పులపాలు కావడమే.

కష్టానికి, రాబడికి పొంతన లేదు

కందుకూరి మోషే, పెట్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం



రైతులు పడుతున్న కష్టానికి, వస్తున్న లాభానికి పొంతనే లేదు.6 నెలల పాటు గొడ్డులా చాకిరీ చేస్తున్నా చివరకు అప్పుల పాలవుతున్నాం. మాకు పూట గడవాలన్నా, పిల్లల చదువులు ఇతర కుటుంబ ఖర్చులకు కావాలన్నా అప్పులను ఆశ్రయించక తప్పడం లేదు. ఆకాల వర్షాలకు నష్టపోయిన సమయంలో పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి. బీమా సౌకర్యం సైతం కల్పించి పంటలను సకాలంలో ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.

నకిలీ మందులతో నష్టపోయా

మందపాటి వెంకటేశ్వర్లు, రైతు, పరగటిచర్ల గ్రామం, రొంపిచర్ల మండలం



గతేడాది 12 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తే నకిలీ పురుగు మందులు బారిన పడి రూ.15 లక్షల వరకూ నష్టపోయా. బిల్లులు తీసుకొని ప్రజా ప్రతినిధులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగినా న్యాయం చేయలేదు. చివరకు స్పందన కార్యక్రమంలో కూడా పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న వారులేరు. అధికారులకు సంబంధిత కంపెనీ యజమాని మామూళ్లు ఇచ్చి ఉంటారని అనుమానంగా ఉంది.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి తీరుతాం

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు
- అంగన్వాడీలకు అండగా నిలుస్తా
- కరోనా సమయంలో వారి కష్టం మరువలేనిది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చదలవాడు అరవిందబాబు, కూతురు డాక్టర్ అమూల్య, కెపి మెటిల్డాదేవి, డి.శివకుమారి తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గౌరవ వేతనం తీసుకునే అంగన్వాడీ కార్యకర్తలు సమాజానికి చేసే సేవ అనిర్వచనీయమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని భువన చంద్ర టౌన్ హాల్లో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే, ఆయన కుమార్తె డాక్టర్ అమూల్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డాదేవి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారిల ఆధ్వర్యంలో వారికి అంగన్వాడీలు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం పని చేసే అంగన్వాడీలను ఆదుకునే బాధ్యత తాను తీసు కుంటానని చెప్పారు.గతంలో వేతనాలు పెంచాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు కోరితే కనీసం వారి వినతిని పట్టించుకోకపోగా లాఠీలతో కొట్టించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని విమర్శిం చారు. కనీసం పోరాటం చేయడానికి కూడా వీల్లేకుండా వారిని అణచి వేసేందుకు ప్రయత్నించారన్నారు. కానీ, ఇప్పుడు ప్రభుత్వం మారడంతో పరిస్థితి కూడా మారిందని,ప్రతి ఒక్కరిక న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామన్నారు. అంగన్వాడీల వేతనాల పెంపు సహా అన్ని డిమాండ్లను పరిష్కరించేలా ముఖ్యమంత్రి చంద్ర బాబును ఒప్పిస్తామన్నారు. జగన్ ప్రభుత్వం పంచాయతిల నిధులను కూడా దారి మళ్లించి వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ, ఆర్థికంగా దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నామన్నారు. విద్య,వైద్య రంగాలను సమూలంగా ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. డాక్టర్ అమూల్య మాట్లాడుతూ కనీస వేతనాల కోసం అంగన్వాడీలు చేసిన పోరాటానికి త్వరలోనే న్యాయం చేసి తీరుతామన్నారు.అంగన్వాడీలు సహా ప్రతి చిరుద్యోగి సమస్యకు ముఖ్యమంత్రి పరిష్కారం చూపిస్తారన్నారు. పేద బడుగు బలహీన వర్గాల వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చేందుకు తోడుగా ఉంటామన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా,ఏ క్షణంలో అయినా ఇంటికి వచ్చి అయినా సమస్య చెప్పుకోవచ్చనన్నారు. నిరంకుశ పాలన పోయి ప్రజాస్వామ్య పాలన వచ్చిందని,ఇక్కడ ప్రజల అభీష్టం మేరకే పాలకులు నడుచుకుంటారని అన్నారు. అనంతరం అరవింద బాబును, అమూల్యలను యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



కనపర్రులో ర్యాలీ.. భారీ అన్నదానం

ప్రజాశక్తి -నాదెండ్ల

మండలంలోని కనపర్రులో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 5,000 మందికి భారీ అన్నదానం చేశారు. మండలం లోని కనపర్రు తెలుగు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల టిడిపి నాయకులు బి. సత్యనారాయణ, కార్యకర్తలు గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో కార్మికుడు మృతి

మృతుడు ఒరిస్సాకు చెందిన వ్యక్తి



ప్రజాశక్తి-నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన కలకత్తా- చెన్నై జాతీయ రహదారిపై మండలంలోని గణపవరం ప్రసన్న వంశి స్పిన్నింగ్ మిల్లు సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ బలరాంరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రాఘవ జైన్, తన కుమారుడు సంతోష్ కుమార్ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్నారు. ఆదివారం మందులు తెచ్చుకునేందుకు బయటికి వెళ్లిన రాఘవ జైన్ (55) తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా చిలకలూరిపేట నుండి గుంటూరు వైపు వెళ్లే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడి కక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రీ కుమారుడు ఇక్కడ పని చేస్తున్నారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం పై కేసు

ప్రజాశక్తి-తెనాలి

వివాహిత అదృశ్యంపై పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం చినరావూరు రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన బత్తుల శివపార్వతి ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో, ఆమె భర్త శివప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగురాళ్లలో విజయోత్సవ ర్యాలీ

- నా గెలుపు కోసం జంగా కృష్ణ మూర్తి ఎంతో కృషి
- అత్యధికమెజార్టీతో గెలిచిన కూటమి శ్రేణులకు ధన్యవాదాలు
- గురజాల నియోజకవర్గం అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే శ్రీనివాసరావు



పిడుగురాళ్లలో విజయోత్సవ ర్యాలీలో యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో గురజాల నియోజకవర్గం నుండి ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటిచేసి గురజాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన యరపతినేని శ్రీనివాసరావుకు కూటమి శ్రేణులు సోమవారం ఘనస్వాగతం పలికారు.పెద్ద క్రేన్ తో గజమాలలు ఏర్పాటు చేశారు. డిజెలతో డప్పు వాయిద్యాలతో శ్రేణులు సంబరాలు నిర్వహించాయి.డ్రోన్ ద్వారా పూలవర్షం ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని టిడిపి కార్యాలయం నుండ యరపతినేని, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు తమ శ్రేణులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. గంగమ్మగుడి,బాప్టిస్ట్ చర్చి, లూథరన్ చర్చి,ఐలాండ్ సెంటర్ మీదుగా జానపాడు రోడ్డు లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకు ఈ ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో యం~పతినేని పాల్గొ న్నారు. కట్టెల అడితిల సెంటంలోని మసీద్‌లో దువా నిర్వ హించారు. అనంతరం పట్టణంలోని ఆర్ అండ్‌బి బంగ్లాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో గెలిపించిన టిడిపి,జనసేన, బిజెపి శ్రేణలకు ధన్యవాదాలు తెలిపారు. జంగా కృష్ణమూర్తి తన గెలుపు కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. గురజాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.



పెద్దతురకపాలెం దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బక్రీద్ పండగ సందర్భంగా నరసరావుపేట మండలం పెద్దతురకపాలెంలోని దర్గాలో ఎమ్మెల్యే చదలవాడు అరవింద బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మెరుగైన సమాజం సాధించాలంటే కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని అన్నారు. అభివృద్ధి అంటే ఏంటో నియోజకవర్గ ప్రజలకు చూపిస్తానని చెప్పారు. అభివృద్ధిలో రాష్ట్రంతో పోటీపడేలా నియోజకవర్గాన్ని మార్చి చూపిస్తానని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని గత పాలకులు పెత్తనం చెలాయించడానికి వాడుకున్నారు. కానీ ప్రజలకు సేవ చేయడం అంటే ఎలా ఉంటుందో తాను చేసి చూపిస్తానన్నారు .రాష్ట్ర అభి వృద్ధి నియోజకవర్గ పురోభివృద్ధి టిడిపి ద్వారానే సాధ్యమన్నారు.అంతకుముందు అరవింద బాబు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన గుర్రంపై స్వారీ చేశారు.



మండలంలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి -పెదకూరపాడు

మండలంలోని లగడపాడు, పాటిబండ్ల, పెదకూరపాడు గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమరావతిలో పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ బక్రీద్ ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత పెద్దలు పాల్గొన్నారు. అనంతరం పేదలకు కుర్బానీ పంచారు.

సేవ చేసి రుణం తీర్చుకుంటా

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ముస్లిం సమాజానికి సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు బక్రీద్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తన తొలి పర్యటనను ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. జమ్మలమడక, మాచర్ల రింగురోడ్డు సెంటర్‌లోని మసీదు స్థలం సమస్యను పరిష్కరించాలని ముస్లింలు ఆయన అడగగా, ఆ రెండు సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు అన్వర్, బాబు ఖాన్, మో సీన్, జలిల్, సాహెబ్ ఉన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన కెసిపి జనరల్ మేనేజర్



ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డిని సోమవారం వెల్దుర్తి లోని ఆయన ఇంటి వద్ద కెసిపి సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ, జి. శ్రీనివాసరావు సీనియర్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్‌అండ్‌ఎస్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిశీలిస్తాం

- మంత్రిగా బాధ్యతలు చేపట్టాక వీలైనంత త్వరలో పరిష్కారం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించిన నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విద్యుత్ శాఖలో కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది అనేక సమస్యలతో సతమతమవుతున్నారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముజఫర్ అహ్మద్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి విన్నవించారు. తొలుత మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు అనంతరం కార్మికుల సమస్యలను వివరించారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్ల సమస్యలపై ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ఇప్పటి వరకు సరైన స్పందన లేదని చెప్పారు. తెలంగాణ తరహాలో జీతాలను నేరుగా కార్మికుల ఖాతాలకు జమ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కొన్నిచోట్ల వాచ్‌మెన్‌లు లేరని, వారిని వెంటనే నియమించాలని అన్నారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటరు రీడింగ్ తీసేవారి జీవనోపాధి దెబ్బతింటోందని, వీరికి మరో ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. యూనియన్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పర్మినెంట్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, మీటర్ రీడింగ్, ముఠా కార్మికుల సమస్యలను వివరించారు. అనంతరం మంత్రి స్పందిస్తూ కొద్దిరోజుల్లోనే తాను మంత్రిగా బాధ్యతలు చేపడతానని, అనంతరం ఈ సమస్యలపై పరిశీలిస్తామని, కార్మిక సంఘాలతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్, గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్, ప్రసాదు పాల్గొన్నారు.


మంత్రి గొట్టిపాటికి వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

దారిలో కాచుకున్న ప్రమాదం..

- నెలలతరబడి ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం
- భయంభయంగా విద్యార్థులు, ఇతరుల రాకపోకలు



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని 16వ వార్డులోని వికాస్ పబ్లిక్ స్కూల్ సమీపంలో శిథిలమైప విద్యుత్ స్తంభం స్థానికులు, వాహనదార్లు ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలం క్రితం ఇనుప విద్యుత్ స్తంభం తుప్పుపట్టి పోవడంతో విద్యుత్ శాఖ అధికారులు దాని స్థానంలో సిమెంట్ స్తంభం ఏర్పాటు చేశారు. అయితే ఇనుప స్తంభాన్ని మాత్రం రోడ్డు పక్కనే ఉంచడంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఈ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాల, మరో ప్రైవేటు కాలేజీ ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విద్యాసంస్థల వాహనాలతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వాహనాలూ వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. ఈ క్రమంలో రోడ్డుపక్కన ఉన్న స్తంభం కొంతభాగం రోడ్డుపైకి రావడం, దానికున్న కడ్డీలు సైతం ప్రమాదకరంగా ఉండడంతో ఆ ప్రాంత వాసులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ స్తంభాన్ని తొలగించాలని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు నిట్టూరుస్తున్నారు.



ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

శాంతి, సంతోషం, త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. బక్రీద్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా వినుకొండ ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. జీవీ ఆంజనేయులు పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ స్ఫూర్తితో ప్రజలంతా సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. ఈద్గా అభివృద్ధి చేయాలనే విన్నపం మేరకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ఎస్పీ కాలనీలో షాదీఖానా నిర్మాణాన్ని చేపడతామన్నారు. రానున్న రెండు మూడేళ్లలో షాదీఖానాను పూర్తి చేసేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు. గుర్రం జాషువా గ్రంథాలయం, టిటిడి కళ్యాణ మండపం, ఎస్సీ, బీసీ భవనాలను కూడా భవిష్యత్తులో పూర్తి చేస్తామని అన్నారు. ఎన్ఎస్పీ మైదానంలో అద్భుతమైన పార్కునూ తీర్చిదిద్దుతాం హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో తన గెలుపునకు ముస్లిములు ఎంతో సహకారం అందించారని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాన్, పట్టణ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, నాయకులు సౌదగర్ జానీబాష, గోల్డ్ కరిముల్లా, రియల్ ఎస్టేట్ జానీ, అజీజు, కొండముట్ల సుభాని డబ్బా సుభాని, ఫరీద్, చికెన్‌బాబు, సాహేబా, జిమ్ జాని, షబ్బీర్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బక్రీద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మాట్లాడారు. త్యాగం, పేదల పట్ల కరుణకు చిహ్నంగా నిర్వహించుకునే బక్రీద్ వేడుకల్లో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో కపలవాయ విజయ్ కుమార్, మీరావలి, మన్నన్ షరీఫ్, బడే బాబు, మాబు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బక్రీద్ సందర్భంగా సత్తెనపల్లి పట్టణం, మండలంలోని పలు ఈద్గాల వద్ద ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ మౌజోనులు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. అందరూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొని కుర్బానీ ఇచ్చారు. ఇతర మాతాల స్నేహితులను వింధుకు ఆహ్వానించారు.

బైపాస్ నిర్మాణం పూర్తిలో దశాబ్దాలుగా ఫెయిల్!

- పిడుగురాళ్లలో నానాటికీ అధికమవుతున్న ట్రాఫిక్ సమస్య
- ఎన్నికలప్పుడు హడావుడిగా వాహనాలకు అనుమతి, ఆపై నిలిపివేత
- నిత్యం వేలాది వాహనాలతో చిక్కిరిబిక్కిరిగా రాకపోకలు


బైపాస్‌లో భాగంగా రైల్వే బ్రిడ్జిపై పనుల్లో కార్మికులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణ ప్రజలకు తీరని కలగా ఉన్న ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోందేగాని పరిష్కారం కావడం లేదు. దశాబ్దం కాలం క్రితం ఏర్పాటైన అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పూర్తయినా పిడుగురాళ్ల పరిధిలోని 5 కిలోమీటర్ల బైపాస్ పనులు మాత్రం ఏళ్ల తరబడి ఫెయిల్ అవుతూ అసంపూర్తిగానే మిగిలాయి. నాడు రహదారి కోసం భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారాన్ని మార్కెట్ రేటు ఆధారంగా చెల్లించాలని కోరారు. ప్రభుత్వం అంగీకరించకపోవడంతో రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ఆపేయాలని కోర్టు స్టే ఉత్తర్వులిచ్చింది. 2014లో ఎమ్మెల్యేగా ఉన్న యరపతినేని శ్రీనివాసరావు భాదిత రైతులతో చర్చించారు. కొంతమందికి మార్కెట్ ధరతో సమానంగా నష్టపరిహారాన్ని ప్రభుత్వం నుండి అందేలా చేశారు. అయినా పనులు పూర్తవ్వలేదు. అనంతరం 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చింది. తాము గెలిస్తే బైపాస్‌ను పూర్తి చేయిస్తానని కాసు మహేష్‌రెడ్డి హామీనిచ్చారు. అందుకనుగుణంగా ఆయన ఎమ్మెల్యే అయ్యాక నష్ట పరిహారం అందని మిగిలిన రైతులకూ పరిహారాన్ని ఇప్పించారు. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి బైపాస్ పనులను వేగవంతం చేయించారు. పిడుగురాళ్ల బైపాస్ పనులు పూర్తి చేయకుంటే పట్టణంలోకి వాహనాలు రానివ్వబోమని సంభందిత సంస్థకు చెందిన టోల్‌గేట్ వద్ద కూడా నిరసనకు దిగారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బైపాస్ పూర్తి చేయటానికి రైల్వేబ్రిడ్జి పనులు ఒకవైపున తాత్కాలికంగా రోడ్డుకు ఒక వైపున పూర్తి చేసి వాహన రాకపోకలకు అనుమతిచ్చారు. రెండోవైపున త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఎన్నికలు ముగిసేంత వరకూ బైపాస్‌పై వాహనరాకపోకలు అధికారులు అనుమతించారు. ఎన్నికల అనంతరం బైపాస్ పనులింకా పూర్తవ్వాల్సి ఉందంటూ వాహనాల రాకపోకలను నిలిపేశారు. దీంతో వాహనాలు తిరిగి పట్టణంలో నుండి రావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. పెద్దపెద్ద కంటైనర్ లారీలు, వేలాది వాహనాలు వస్తుండటం, హైదరాబాద్ నుండి చెన్నై, గుంటూరు వెళ్లే వాహనాలు ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉండడంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ చిక్కులు నిత్యం సమస్యగా మారుతున్నాయి. తాజా ప్రభుత్వమైనా ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అయోమయంలో ఎమ్‌డియు వాహనదారుల పరిస్థితి

ప్రజాశక్తి-తాడేపల్లి

గత వైసిపి ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దకే రేషన్ ఇవ్వాలనే ఉద్దేశంతో మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండియు) వాహనాలను ఏర్పాటు చేసింది. వాహనాలకు నెలనెలా ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.5 వేలు చెల్లిస్తుంది. మరో రూ.3 వేలు మొబైల్ వాహన నిర్వాహకుడు చెల్లించాలి. వాహనం అతని పేరు మీదే రిజిష్టర్ అవుతుంది. కిస్తీలన్నీ తీరిపోయిన తరువాత వాహనం అతని సొంతం అవుతుంది. ఇందుకోసం మొబైల్ వాహనం నడిపే నిర్వహణ బాధ్యతులు చూసే వ్యక్తికి రూ.21 వేలు





జీతం ఇస్తున్నారు. ఇందులో రూ.3 వేలు కిస్తీ కింద చెల్లించాల్సి ఉంటుంది. మరో రూ.5 వేలు వాహనంలో సహాయకునిగా ఉండే వ్యక్తికి ఇవ్వాల్సి ఉంటుంది. వాహనం పెట్రోల్ కోసం రూ.3 వేలు నెలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ పోనూ రూ.8 వేలు మాత్రమే మొబైల్ వాహనదారుడికి వస్తుంది. కిస్తీలన్నీ తీరిపోయిన తరువాత వాహనం తమకు దక్కుతుందని ఆశతో ఎండియు వాహనాలకు అనేక మంది దరఖాస్తు చేసుకుని తమ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం అప్పట్లో సూపర్ క్యారీ అనే పేరుగల ఎండియు వాహనాలను సుజుకి, టాటా కంపెనీలకు కాంట్రాక్టు ఇచ్చింది. ఈ వాహనంలో 40 బస్తాల రేషన్ బియ్యం తీసుకెళ్లి ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తున్నారు. తాడేపల్లి పట్టణం, రూరల్‌లో మొత్తం 34 డిపోలు ఉన్నాయి. 17 వాహనాలు ప్రస్తుతం వాహనాలు రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ చేరవేస్తున్నాయి. మొన్న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. ఎండియు వాహనాలు అక్కర్లేదనే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. గతంలో మాదిరిగానే రేషన్ షాపులకు వచ్చి ప్రజలు రేషన్ తీసుకెళ్తారని ప్రభుత్వం చెబుతుంది. దీంతో ఎండియు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రోడ్డున పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చెల్లించిన కిస్తీల పరిస్థితి ఏంటని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా కట్టాల్సిన కిస్తీలు చెల్లించకపోతే కంపెనీ వాహనాలను తీసుకెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు దార్ల బ్రహ్మానందరావు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంటింటికీ రేషన్ అందించే మొబైల్ వాహనాలను కొనసాగించాలని, దాని మీద ఆధారపడిన వారికి న్యాయం చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు.

కందిపప్పు, పంచదార ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి :రేషన్‌కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటిదాకా తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. బయట మార్కెట్లో కందిపప్పు, పంచదార అధిక ధరలకు పేదలు కొనుగోలు చేయలేకపోతున్నారని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఈ ప్రభుత్వం అయినా రేషన్ దుకాణాల ద్వారా పంచదార, కందిపప్పు అందించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎవిఎన్ కుమారి

అంగన్వాడీలకు పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్‌వాడీలకు తక్షణమే వేతనాలు పెంచాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు ఎవియన్ కుమారి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఏవిఎన్ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పెండిగ్ వేతనాలు, పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. ఖాళీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిం చినప్పటికీ ఆయాలను టీచర్స్‌గా ప్రమోట్ చేయకపోవటం వల్ల పనిభారం పెరుగుతుందని, తక్షణమే ఇంటర్వ్యూలు నిర్వహించి, టీచర్స్‌గా ప్రమోట్ చేయకుండా పెండింగ్‌లో ఉన్న వాళ్ళందరినీ వెంటనే టీచర్లుగా ప్రమోట్ చేయాలని కోరారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అధి కారులు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీలను అర్హులైన టీచర్లతో భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రత్న మంజుల, కె.చిన్నవెంకాయమ్మ, రాజకుమారి, రాజేశ్వరి, లక్ష్మీ పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా బక్రీద్

ముస్లిమ్ సోదరులకు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యా,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మంగళగిరి అంజుమన్- యి- హిమాయతుల్ ఇస్లాం ఈద్గాను సోమవారం సందర్శించారు. ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్ వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్గా వద్ద యువనేతకు ఘనస్వాగతం లభించింది. ఇస్లాంలో త్యాగం, దానగుణాలకు ప్రత్యేకమైన స్థానముంది. ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే పండుగ ఈద్ అల్ అదా (బక్రీద్) సమాన భావన పెంపొందిస్తుందని లోకేష్ అన్నారు. ప్రజలు లోకేష్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని లోకేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మంగళగిరి నియోజకవర్గం సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి పట్టణ కార్యదర్శి షేక్ రియాజ్, ఎండి ఇబ్రహీం, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి : త్యాగనిరతికి ప్రతీకైన బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్దలతో సోమవారం జరుపుకున్నారు. పట్టణంలో మొత్తం 25 మసీదుల పరిధిలోని ముస్లింలంతా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ, చెంచుపేటలోని ఈద్గా మసీదులో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. రైలు పేట మసీదు ఇమామ్ ఇమ్రాన్ భేగ్ ఆధ్వర్యంలో నమాజ్ జరిగింది. ఇస్లాంపేట మర్కస్ మసీదులో మౌలానా అబ్దుల్లా, గాంధీ నగర్ లోని మస్జిద్ ఏ ఆయేషా సిద్ధఖాలో ముఫ్తి ఇర్ఫాన్, జామియా మసీదులో ఎండి ఇమ్రాన్, రైస్ కాలనీ మసీద్ ఏ ఉస్మానియా లో హఫీజ్ మహమ్మద్ అలీ, పాండురంగపేట మక్కా మసీదులో మౌలానా ఇమ్రాన్ ఆధ్వర్యంలో, అలాగే చినరావూరు నూరియా మసీద్, అఖ్తా మసీద్ లో నమాజ్ చేశారు. తదుపరి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.




మంగళగిరి ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి -పొన్నూరు : బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో, ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మార్గంలోని ఈద్గా మైదానంలో మర్కస్ మసీద్ మౌలానా కుతుబుద్దీన్ బక్రీద్ పర్వ దినం విశిష్టతను గురించి తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. తర్వాత పేదలకు ముస్లిం సోదరులు దానధర్మాలు చేశారు. పట్టణంలోని మసీదుల వద్ద అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ పి భాస్కర్ ఆధ్వర్యంలో అదనపు పోలీసు బలగాలతో భారీ బందోబస్తు నిర్వహించారు.





తెనాలి, పొన్నూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్ రావు

గుంటూరు ఛానల్‌కు తక్షణం నిధులు కేటాయించాలి

నల్ల మడ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ సుదీర్ఘకాలంగా ఈ ప్రాంతంలో ఆందోళనలు జరుగుతున్నాయని, వెంటనే భూసేకరణకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్ రావు డిమాండ్ చేశారు. సోమవారం పెదనందిపాడు లోని కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో జరిగిన రైతుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ఈ సమస్య మీద ప్రభుత్వంలో 21 రోజులపాటు గుంటూరులో నిరసన దీక్షలు జరిపామని, 15 రోజులపాటు పెదనందిపాడులో నిరసన దీక్ష చేశామని, అయినా వైఎస్ జగన్‌మోహన్ ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదని తెలిపారు. ముఖ్యమంత్రి వద్దకు బయలుదేరిన రైతులను పోలీసులు అడ్డగించి రైతుల పైన మహిళల పైన దౌర్జన్యం చేశారని తెలిపారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా నల్లమడ వాగు అభివృద్ధికి నిధులు కేటాయించి, శాశ్వత వరద నివారణకు చర్యలు చేపట్టాలని గండ్లు పూడిపించాలని కోరారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, బండి నాగేశ్వరరావు, రావి శివరామకష్ణయ్య, ఈదర బ్రమరేశ్వరి, కొల్లా రామన్, కొల్లా నిర్మల, ముప్వా పెద్దన్న, ప్రొఫెసర్ కె విజయకుమార్, లాయర్ అంకమ్మ, ఆళ్ల వెంకట్, ముద్దన రాఘవయ్య, పోపూరి వెంకటప్పయ్య, అహ్మాద్ బాషా, ఏ వెంకటేశ్వర్లు, దివ్వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు వెంకటరమణ అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు

టిడిపి జిల్లా సీనియర్ నాయ కులు కూనంనేని వెంకట రమణ సోమవారం మంగళగిరిలో రాష్ట్ర మానవ వనరులు, ఐటి శాఖ మాత్యులు నారా లోకేష్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి, జాతీయ చిత్రపటంలో మొదటి స్థానంలో నిలుస్తుందని ఆకాంక్షించారు.



లోకేష్‌కు బొకే అందచేస్తున్న వెంకటరమణ

విద్యార్థుల భవితకు సోపానం శ్రీ సాయి భవిష్య అకాడమి

డైరెక్టర్ కె.దుర్గానాగమల్లేశ్వరరావు

ప్రజాశక్తి-తెనాలి





మారుతున్న విద్యా ప్రణాళికలకు అనుగుణంగా శ్రీ సాయి భవిష్య అకాడమి విద్యార్థుల భవిష్యత్‌కు పటిష్టమైన పునాది వేస్తోందని డైరెక్టర్ కె.దుర్గానాగమల్లేశ్వరరావు చెప్పారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్ అవుట్ గేట్‌కు ఎదురుగా నున్న అకాడమిలో ఇంటర్‌తో పాటు జెఇఇ మెయిన్స్. నీట్, ఎయిమ్స్, జిప్‌మర్ వంటి పరీక్షలకు అనుసరిస్తున్న బోధనా పద్ధతులను ఆయన వివరించారు. కళాశాల్లో ఇంటర్ బైపిసి, ఎంపిసి, ఎంఇసి, సిఇసి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపిసి విద్యార్ళుకు ఐఐటి, జెఇఇ మెయిన్స్, జెఇఇ అడ్వాన్స్, ఎంసెట్, అలాగే బైపిసి విద్యార్థులకు నీట్, ఎంసెట్, ఎంఇసి, సిఇసి విద్యార్థులకు సిఎ ఫౌండేషన్, రెగ్యులర్‌లో విశేష అనుభవం కలిగిన అధ్యాపకులతో అత్యుత్తమ శిక్షణ నిస్తున్నట్లు చెప్పారు. జెఇఇ మెయిన్స్. నీట్‌కు ఎస్ 40 బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కళాశాల్లో డిజిటల్ ఎ.సి క్లాస్ రూమ్స్, అత్యాదునిక ల్యాబ్ సౌకర్యం, శారీరక, మానసిక వికాసానికి యోగా, మెడిటేషన్, విద్యార్థుల అభిరు చులకు అనుగుణంగా ఇండోర్ గేమ్స్ అవుట్ డోర్ గేమ్స్, ఎన్‌సిసిలో ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థులను విభిన్న ప్రతిభావంతులుగా తీర్చి దిద్దేందుకు పర్సనాలిటీ డెవలప్ మెంట్‌లో శిక్షణ, గ్రూప్ డిస్కషన్స్, డిబేట్ వంటివి నిర్వహిసు న్నట్లు చెప్పారు. అన్నింటిని మించి సిసి కెమేరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పట్టణ పరిసర ప్రాంత విద్యార్థులకు వ్యాన్/బస్ సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జూనియర్ ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు

జూనియర్ ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలను శ్రీ సాయి భవిష్య అకాడమి సొంతం చేసుకుంది. ఎంపిసి విభాగంలో 470మార్కులకు వి.స్వాతి 450, జి.ధనలక్ష్మి 446, ఎన్.ప్రసన్న 445, పి.గాయత్రి 436, టి.భరత్ 417, సిఇసిలో 500 మార్కులకు కె.రిబ్కా 397 మార్కులు సాధించారు.



అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - సత్తెనపల్లిటౌన్

సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ,డీఈ మధుసూదన రావు, ఎఈ సాగర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్ధసారథి ఈ భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. యుద్ధ ప్రాతిపదికన అన్నా క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించే నిమిత్తం క్యాంటీన్ పరిశుభ్ర పరచాలని సిబ్బందిని ఆదేశించారు. వీరి వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు. కాగా, టిడిపి హయాంలో ప్రారంభించిన ఈ క్యాంటీన్‌ను గత వైసిపి ప్రభుత్వం మూసివేసింది. అప్పటి నుండి ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మరమ్మతులకు గురైంది. టిడిపి అధికారంలోకి రావడంతో తిరిగి అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ క్యాంటీన్ భవనాన్ని అధికారులు పరిశీలించారు.



మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వినుకొండ

మాల మహానాడు నూజెండ్ల మండలం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రెసిడెంట్ గడిపూడి యేసు రత్నం సోమవారం తెలిపారు. మండల కార్యదర్శిగా చందారపు వెంకట గిరిని, ఉపాధ్యక్షుడిగా రాయపూడి కొండ గురవయ్య ను నియమించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని రవ్వారంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌల్ మాట్లాడారు. మండలంలోని ప్రతి మాల పల్లెను సందర్శించి కమిటీని బలోపేతం చేస్తామని,ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను కలుపుకొని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తామని తెలిపారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర హోం శాఖ మంత్రి మంత్రి పదవిని ఎస్సీ మహిళ వంగలపూడి అనితకు కేటాయించడంపై ఎస్సి మాదిగ సామాజిక తరగతి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞత తెలుపుతూ ఆయన చిత్రపటానికి మాదిగ సామాజిక వర్గం నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో కె.కృపారావు, సిహెచ్ ఆగస్టస్ బాబు, బి.నాగరాజు, బి.ఏలియా ,సిహెచ్ జాన్సన్ , స్కైలాబ్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం

- ప్రజల్లో అవగాహన లోపం
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- అధికారుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు





నరసరావుపేట నుండి మురుగు నీరు పోయే కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం రోజు రోజుకు విచ్చలవిడిగా పెరుగుతూ ప్రజల జీవనశైలీలో ప్రతి పనిలో ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. అధికారుల పర్య వేక్షణ లోపం ప్రజలకు అవగాహనా లేమి నిర్లక్ష్యంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు పొంచి ఉంది.కొన్నేళ్లుగా ప్లాస్టిక్ విక్రయించడం, నిల్వ చేయడం, పంపిణీ, వినియోగాన్ని నిషే ధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు నిషేధం పరిధిలోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్యాకింగ్ కవర్లు, రోడ్లపై వేయడంతో



నరసరావుపేట-రొంపిచర్ల మార్గంలో అల్లూరివారిపాలెం శివారులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

వసు_్తవులు, ప్లాస్టిక్ కవర్లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా విక్రయాలు వినియోగం జరుగుతున్నప్పటికీ అధి కారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నా రన్న ఆరోపణలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాస్టిక్ ఉత్పత్తులను గాలికి ఎగిరి మురుగు నీటి కాలువల్లో పేరుకుపోయి వ్యర్థాలతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. ఎక్కడపడితే అక్కడ రోడ్ల పైన ప్లాస్టిక్ కవర్లు,ప్లాస్టిక్ వ్యర్థాలు పారవేయడం ప్రజల తప్పిదాలతో నోరులేని జీవాలు మత్యువాత పడుతున్నాయి. పచ్చని పచ్చిక బయళ్లలో పశు గ్రాసం తినాల్సిన ఆవులు చెత్త కుప్పలలో ప్లాస్టిక్ కవర్లలో నింపి పారేసిన పాచిపోయిన ఆహారం, కుళ్లిపోయిన పండ్లతో పాటు ప్లాస్టిక్ సంచులను కూడా మూగ జీవాలు తినేస్తుండడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పశువుల పొట్టలో గుట్టల్లా పేరుకుపోయి అనారోగ్యానికి గురై మత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తిని చనిపోయిన ఆవులను పశువుల వైద్యులు పరిశీలించగా వాటి పొట్టలో నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడ్డాయి. గ్రామాలలో స్వచ్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యర్డ్‌లు అలంకారప్రాయంగా మారాయి.

నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ఏకమై ప్లాస్టిక్ వినియోగం, నిల్వ ప్రదేశాలు, విక్రయ దుకాణాలు, దిగుమతులు, పంపిణీపై దృష్టి పెడితే వినియోగం తగ్గించే అవకాశం ఉంది. ఎక్కడ ప్లాస్టిక్ వినియోగించినా తక్షణమే జరిమానాలు విధించే విధంగా చర్యలు చేపడితే తప్పనిసరిగా మార్పు వచ్చే అవకాశం ఉంది. అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహించి జరిమానా విధించడంతో సరి పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన వీధులలో హెూటళ్లు , దుకాణ సముదాయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడరాదని పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని బోర్డులు పెట్టి అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వినియోగం మానవాళికి పర్యావరణానికి వాటిల్లే ప్రమాదం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ కవర్లు తయారీదారులు,



చెత్త కుప్ప వద్ద పడేసిన ప్లాస్టిక్ కవర్లు, ఆహార పదార్థాలు తింటున్న ఆవు

అమ్ముతున్న వారిపై అధికారులు దాడులు నిర్వ హించి కఠిన చర్యలు తీసు కోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసి భూమి సారం తగ్గి పండే పంటలపై ప్రభావం చూపే అవ కాశాలు ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జగన్ ఇకనైనా ఆ మాటలు మానుకోవాలి

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

ఐదేళ్ల పాలనలో ప్రజలను అన్నివిధాలా మోసం చేయడమే కాకుండా తనను ఎందుకు తిరస్కరించారో తెలియడం లేదని, ఆ దేవుడికే తెలియాలంటూ డైలాగులు చెబుతున్న జగన్ ఇకనైనా ఆ మాటలు మాను కోవాలని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు విమర్శించారు. సోమవారం స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.

అనంతరం సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం పేదలు, సామాన్య ప్రజల ఉసురు పోసుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ లాంటి వారిని దేవుడు కూడా క్షమించడని ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు అన్నారు. 30 లక్షలమంది పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తానని మోసం చేసిన జగన్, తాను మాత్రం రుషికొండలో రూ.500 కోట్లకు పైగా ఖర్చు చేసి ఇంద్ర భవనం నిర్మించుకున్నారని విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.45 కోట్లు పెట్టి సోకులు చేయించుకున్నా రని ఎద్దేవా చేశారు. ఇదే జగన్ చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఆ మొత్తంతో కనీసం 30 వేల మందికి గృహ వసతి సమకూరేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పేదల ఇంటికి ఇచ్చిన రూ.1.8 లక్షల మొత్తాన్ని ఆధా రంగా చేసుకునే తాను ఈ లెక్కలు చెబుతున్నానని అన్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

అగ్ని ప్రమాద బాధితులకు 'శివశక్తి' చేయూత

బొల్లాపల్లి మండలం రావులాపురంలోని చెంచు కాలనీ కి చెందిన మేకల రాజు, మేకల దుర్గా ప్రసాద్ గత రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన అగ్నిమాదంలో సర్వం కోల్పో యారు. మండలంలోని టిడిపి నాయకులు ఈ విష యాన్ని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకు వెళ్లారు. శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబాలకు సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామాగ్రి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్య క్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జె.గోవింద నాయక్ ,టిడిపి నాయకులు పి.నాగేశ్వరరావు, ఎ.మన్నయ్య, వెంకట కోటయ్య, ఎలిశెట్టి రంగయ్య పాల్గొన్నారు.

ప్రజల సొమ్ముపై ఇంకా మోజు తీరలేదు

- మాజీ సిఎం జగన్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శలు
- రూ.16 కోట్ల విలువైన ఫర్నిచర్‌ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గతంలో తన తండ్రి అధికారాన్ని, గడిచిన ఐదేళ్లలో తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని లూటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్, అవి చాలక తన హయాంలో ప్రభుత్వ సొమ్ముతో కొన్న ఫర్నిచర్ కూడా దొంగతనం చేశారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాధనాన్ని కొల్లగొట్టిన మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజల సొమ్ము మీద మోజు తీర లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి క్యాంపు కార్యా లయాన్ని సచివాలయ ఫర్నిచర్‌తో నింపేశారని, అధికారం కోల్పోయాక రూ.16 కోట్ల విలువైన ఫర్నిచర్ తిరిగి ప్రభుత్వానికి ఇవ్వకుండా సొంత ఇంట్లో ప్రభుత్వ సొమ్ముతో సకల సౌకర్యాలు అమర్చుకున్నారని అన్నారు. మాజీ సీఎం జగన్ ఫోటోలు స్టూడెంట్ కిట్స్‌పై ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పంపిణీ చేశారన్నారు. నాడు ప్రజా వేదికను కూల్చవద్దని, వినియోగించుకోవాలని, లేనిపక్షంలో బాధ్యత గల ప్రతిపక్షంగా తనకు ఇవ్వమని చంద్రబాబు నాడు అడిగినా జగన్ పట్టించుకోలేదని విమర్శించారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు విజ్ఞప్తిని పట్టించు కోకపోగా దానిని కూల్చివేసి తన వికృత బుద్ధిని జగన్ బయట పెట్టుకున్నారని దుయ్యబట్టారు. నాడు తన క్యాంపు కార్యాలయంలో ఉన్న అసెంబ్లీ ఫర్నిచర్ తీసుకువెళ్లాలని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు గౌరవంగా అసెంబ్లీ కార్యదర్శికి లేఖ రాస్తే దానిని రాజకీయం చేసి ఆయనను మానసికంగా హింసించారని ఆరోపించారు.

చినుకు పడితే ఛిద్రమయ్యే రోడ్లతో ప్రజల పాట్లు

- మెల్లంపూడి రోడ్డంతా గుంతలమయం
- రోడ్డు వెడల్పు పేరుతో దుస్థితిలో కుంచనపల్లి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రతి అడుగుకి గుంత. ఒక్కో గుంత చెరువును తలపించే విధంగా మారింది. ఇదే రోడ్డులో రైతాంగం తమ వ్యవసాయ పనులకు వెళుతుంటారు. గుండి మెడ, మెల్లెంపూడి భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం ఈ రోడ్డు వైపు నుండే మంగళగిరి, విజయవాడ వెళుతుంటారు. వర్షం పడిన ప్రతిసారి చెరువును తలపించే విధంగా గుంతలలో నీళ్లు చేరుతుంటాయి. తాడేపల్లి మండల పరిధిలో కే ఎల్ యు వైపు నుండి మెల్లంపూడి గుండిమెడ గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డు పరిస్థితి అద్వానంగా మారింది. రైతులు వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఈ రోడ్డు వైపు నుండి తమ పనుల కోసం రాకపోకలు సాగించే క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు పర్యాయాలు మంగళగిరి శాసనసభ సభ్యులుగా పనిచేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి మెల్లంపూడి గుండిమెడ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వది లేశారు. వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ రోడ్డుపై ప్రయాణించే గ్రామస్తులు అవస్థలు మాత్రం వర్ణాణాతీతం.



కుంచనపల్లి రోడ్డు దుస్థితి

గత ప్రభుత్వ హయాంలో రోడ్డు వెడల్పు చేస్తామని, రోడ్డుకి ఇరువైపులా, నివాసాల ఇండ్ల మెట్లు తొలగించి, డ్రైనేజ్ కాలువలను పగలగొట్టిన అధికారులు రోడ్ వేయడం మరిచారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామం ప్రధాన రహదారి నుండి కే ఎల్ యు వైపుకు వెళ్ళు ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి, అధ్వానంగా మారింది. పరిసరాలలో వాడిన వ్యర్థపు నీరు డ్రైనేజీ కాలువ లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చి గుంతలలోకి చేరింది. దీంతో దోమలు అధికంగా ప్రబలి, రహదారి వెంట ఉన్న ఇళ్లలోకి దోమలు అధికంగా వచ్చి చేరుతున్నాయి. వర్షం వస్తే రోడ్డుపై చిన్న సైజు కొలను లు ఏర్పడుతున్నాయి. ఇళ్ళ ముందు మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతున్న దోమ కాటుతో తమ ఇబ్బందులు పడుతున్న ఎంపీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరి శాసనసభ్యుడుగా ఉన్న ఆళ్ళ రామకష్ణారెడ్డి ఈ రోడ్డుకి శంకుస్థాపన చేసి, కొత్తగా రోడ్డు నిర్మిస్తామని చెప్పి నిర్లక్ష్యం చేశారని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే ప్రజల ఇబ్బందులు గమనించి, దోమ కాటు వలన అనారోగ్యం బారిన పడనకుండా రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మించి, ఏర్పడిన నూతన ప్రభుత్వం పట్టించుకుని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అడుగడుగునా గుంతలు ఏర్పడిన మెల్లెంపూడి రోడ్డు



కెఎల్‌యు వర్సిటీకి వెళ్లే ప్రధాన రహదారి

19 నుండి వర్సిటీలో యోగా ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఈనెల 21 అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 19 నుండి 23 వరకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆద్వర్యం లో సదరన్ రీజియన్ స్థాయి యోగ ,మరియు ఆహార నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చుటకు ప్రణాళికా సంఘం సమావేశం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్‌భవనంలో జరిగినది. ఈ కార్యక్రమానికి గుంటూరు ఆర్ జేడి బి. లింగేశ్వర రెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయి యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు లేకుండా కమిటీలు విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో దక్షణాది రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, తెలంగాణ, గోవా, ఆంధ్ర ప్రదేశ్, అండమాన్, కర్నాటక, సదరన్ రైల్వే విభాగం నుండి స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొంటారని తెలిపారు. గుంటూరు ఉప విద్య శాఖ అధికారి వేంకటేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని యూనివర్సిటీలో జరపటం మనకు గొప్ప అవకాశమని దీనిని జయప్రదం చేయాలని సూచించారు. తెనాలి ఉప విద్య శాఖ అధికారి శాంతా కుమారి మాట్లాడుతూ అందరూ సమన్వయం తో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఎస్ఒసి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.





హైమారావును అభినందిస్తున్న రామకృష్ణ

ఎన్‌టిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైమారావు

ప్రజాశక్తి-గుంటూరు

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నగరంలోని కోకబాల ప్రభాకర మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బొనిగల హైమారావును మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ సోమవారం తన నివాసంలో అభినందించారు. హైమారావు గత 20 ఏళ్ల నుండి ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేశాడని, ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవటం శుభపరిణామం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హైమారావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కె.అబ్దుల్ ఖలీల్, ఎన్.వి.జగదీష్, ఆర్థిక కార్యదర్శి జి.ఆంతోని, నగర నాయకులు పి.లలితబాయి, పి.సాయివిశ్వనాథ్, ఎ.హరగోపాల్ పాల్గొన్నారు.



మంత్రి నారాలోకేష్‌కు ఎఐటియుసి వినతి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజనం కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం ఉండవల్లి తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మెస్ ఛార్జీలు కూడా పెంచాలని కోరారు. కార్మికులను తొలగించే విధానాన్ని పక్కనపెట్టి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 86,500 మంది పేద మహిళలు మధ్యాహ్న భోజన పథకంలో 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ, పింఛను సౌకర్యం కల్పించడంతో పాటు వంట గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని కోరారు.



ఎమ్మెల్యే నరేంద్రకు ఎస్‌టియు నాయకుల సన్మానం

ప్రజాశక్తి -పొన్నూరు

ఎస్‌టియు పొన్నూరు మండల, పట్టణ శాఖల తరపున శాసనసభకు ఎన్నికైన ధూళిపాళంల నరేంద్ర కుమార్‌ను ఆయన స్వగహం వద్ద ఎస్‌టియు నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బి. హనుమంత్ ప్రసాద్, సూరిశెట్టి శ్రీనివాసరావు, కొనికి శ్రీనివాస రావు, ముజఫర్ జానీ, అబ్దుల్ హమీద్, బి.రామారావు, కే. సత్యనారాయణ, టీవీ. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ముస్లిం సోదరులు సోమవారం తాడేపల్లిలో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. రంజాన్ తరువాత ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునేది బక్రీద్. బక్రీద్ మాసం ప్రారంభంలోనే ముస్లింలు పెద్దఎత్తున హజ్ యాత్రకు వెళ్తారు. ఉదయాన్నే తాడేపల్లిలోని ఒకటో వార్డు, మున్సిపల్ కార్యాలయం ఏరియా, ముగ్గురోడ్డు, పోలకంపాడు, మహానాడు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు తమకున్న దాంట్లో దానం చేశారు. ఒకరికొకకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

విద్యార్థులకు చిన్మయ మిషన్ వితరణ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చేయూత ‵నిచ్చారు.స్థానిక సుల్తానాబాద్ కుమార్ పంప్స్ సంస్థ ఆవరణ లోని సత్సంగ్ హాలులో అలపర్తి నాగరత్నం అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 9,10 తరగతులలో ప్రతిభ చూపిన 14 మందిని ఎంపిక చేసి మొత్తం గా రూ.80 వేల హార్దిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి శారద మాట్లాడుతూ సంస్థ తరపున పేద విద్యార్థులకు చేయూతనందించే కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరికొందరికి స్ఫూర్తిదాయకం కావా లని, తద్వారా పేద విద్యార్థులకు బాసటగా నిలవాల న్నారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులతో చిన్మయ మిషన్ బృందం



మంత్రి మనోహర్‌కు రెడ్‌క్రాస్ బృందం అభినందన

ప్రజాశక్తి - తెనాలి

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ బందం సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిసి అభినందించారు. స్థానిక బోస్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో రెడ్ క్రాస్ కార్యదర్శి ఎం భానుమతి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ తరపున నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను వివరించారు. రక్త దాన శిబిరం ద్వారా రక్త సేకరణ, ఉచిత వైద్య శిబిరాలు, మహిళలకు ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సులు వంటి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. సంస్థ సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రిని రెడ్ క్రాస్ తరపున సత్కరించారు. కార్యక్రమంలో హ్యాపీ హాస్పిటల్ అధినేత డాక్టర్ వి పవని ప్రియాంక, కుర్రా సుజాత, శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేశన తదితరులు

రామోజీరావుకు బీసీ సంక్షేమ సంఘం నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనాడు-ఈటీవీ అధినేత పద్మ విభూషణ్ చెరుకూరి రామోజీరావు గొప్ప మానవతావాదని, పేదలు శ్రమజీవుల పక్షాన కలంతో పోరాడిన అక్షర యోధుడని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. స్థానిక రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రామోజీ సంస్మరణ సభ నిర్వహించారు. సభలో కేశన మాట్లాడారు. రెక్కాడితేగాని డొక్కాడని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రామోజీ వ్యాపార, మీడియా, సినిమా రంగాలలో రామోజీ గ్రూపు సంస్థల పేరిట, అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాల అధిరోహించారన్నారు. ఇంకా ఈ సంస్మరణ సభలో కే క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, జిల్లా కోఆర్డినేటర్ స్వాతి గౌడ్, రాష్ట్ర నాయకులు శివరాం బాబాజీ, తెర్లి మోహన్రావు, ఉడుత శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ యాదవ్ జయలక్ష్మి, సూర్య ప్రకాష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

22న డోలు విద్వాంసులు భూసురపల్లి ఆదిశేషయ్య ఉత్సవాలు

డాక్టర్ కొమాండూరి శేషాద్రికి పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రఖ్యాత డోలు విద్వాంసులు, లయబ్రహ్మ కీర్తిశేషులు భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఈనెల 22వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గతంలో ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవాలలో భాగంగా ఐదు సార్లు ఆయా రంగాల ప్రముఖులకు పురస్కారాలు అందించామని, ఈఏడాది గాన, విద్యా, వాచస్పతి, సప్తగిరి సంగీత విద్వాన్మని డాక్టర్ కొమాండూరి శేషాద్రికి పురస్కారం అందజేస్తున్నట్లు చెప్పారు. సభకు సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిథిగా పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి విచ్చేస్తారని, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, భూసరపల్లి అంజయ్య, చిట్టిపోతు మస్తానయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు. నగరంలోని సంగీత, సాహిత్య అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

జగన్ వైఖరిలో మార్పు రాలేదు

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్‌లు : ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ప్రజలు తిరస్కరించినా ఇప్పటి మాజీ సీఎం జగన్ వైఖరిలో మార్పు రాలేదనిప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టాన్ని ప్రజలు ముక్త కంఠంతో తిరస్కరిస్తే ఇప్పటికీ ఈ చట్టం మంచిదని జగన్ వాదించడం విడ్డూరంగా ఉందన్నారు. 5 ఏళ్ళ వైసిపి ప్రభుత్వం ప్రజల తిరస్కరణకు గురైందనడంలో జరిగిన ఎన్నికలే నిదర్శనం అన్నారు. ప్రజలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు మద్దతుగా నిలిచి అత్యధిక స్థానాలు కూటమికి అందించారన్నారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన మరుసటిరోజునే మ్యానిఫెస్టో అమలుపై దృష్టి సారించి 5 సంతకాలు చేశారన్నారు. వైసిపి హయాంలో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారన్నారు. మెగా డి.ఎస్.సి తో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేసారని అన్నారు. 2 వేల రూపాయల పెన్షన్ ని 3 వేలు చేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి దఫాల వారీగా పెంచుకుంటూ వెళ్లి ప్రజలను మోసం చేశారన్నారు.ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టగానే 4 వేలు పెన్షన్ పెంపు పై చంద్రబాబు సంతకం చేశారు. పెన్షన్ల పెంపుపై వద్దులు, వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వారిలోని నైపుణ్యాలను గుర్తించడం కోసం స్కిల్ గణనపై చంద్రబాబు సంతకం చేసారు. పేదల ఆకలి తీర్చడానికి అన్నా క్యాంటీన్ ప్రారంభించడానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. అన్నా క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ బాటలోనే మేము నడవడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కల్లూరి శ్రీనివాసరావు, నక్కల అగస్టీన్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నాయుడు ఓంకార్, లింగంగుంట్ల ఆదాం, ఇమ్మడి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఖైనీ,గుట్కా అమ్మకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాపేరు ముఖేష్.... గుట్కా తినడం వలన గొంతు క్యాన్సర్ సోకింది. వైద్యులు చికిత్స చేయబోతున్నారు. బహుశా నేను మాట్లాడలేక పోవచ్చు అని ఒక వీడియో... అదేవిధంగా పొగాకు నమిలి నోటి క్యాన్సర్ సోకింది చికిత్సకు 2 గాజులు అమ్మాను అని మరో వీడియో... అనంతరం వైద్యులు ముఖేష్ ను కాపాడలేకపోయాం ప్రాణాంతక పొగాకు మిళిత ఖైని, గుట్కా వినియోగానికి దూరంగా ఉండాలని వైద్య నిపుణులు నిత్యం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నప్పటికీ వినియోగదారులలో ఎటువంటి మార్పు లేదు. ఖైని, గుట్కా అమ్మకాలు వలన జీవితం అర్ధంతరంగా ముగుస్తుందని వినియోగం ప్రాణాంతకమని ప్రచారం జరుగుతున్నా నిషేధం అమలు జరగడం లేదు.





నరసరావుపేటలో ఒక దుకాణంలో వినియోగదారుడు కొనుగోలు ఖైని ప్యాకెట్లు

తయారీని, అక్రమ రవాణా, చాటుమాటు విక్రయాలను నియంత్రించడంలో మామూళ్లకు అలవాటు పడిన అధికారులు సహకారంతో ప్రతి దుకాణంలో ఖైని గుట్కా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వినియోగం బాగుండడంతో తయారీదారులు రెచ్చిపోతున్నారు. నిషేధం లేని రాష్ట్రాల్లో బహిరంగంగా క్రయ విక్రయాలు జరుపుతుంటే నిషేధం అమలులో ఉన్న రాష్ట్రాల్లో సైతం చాటుమాటుగా విక్రయాలు అంతకంటే ఎక్కువగానే జరుగుతూనే ఉన్నాయి.

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటతో పాటు జిల్లా వ్యాప్తంగా పొగాకు మిళిత మాదకద్రవ్యాల మత్తు పదార్థాలైన ఖైని గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఒకరిని చూసి మరొకరు సరదాగా వినియోగానికి మత్తుకు అలవాటు పడి చివరకు ఖైని గుట్కాకు బానిసలై యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారు. తెలంగాణ, గోవా, కర్ణాటక, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ఖైని గుట్కా ప్యాకెట్ల బస్తాలు రవాణా జరుగుతున్నట్లు సమాచారం. కొన్ని నెలల క్రితం హైదరాబాద్ నుండి నరసరావుపేట తరలిస్తున్న ఖైని గుట్కా పాకెట్లను నరసరావుపేట రూరల్ పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రధానంగా జిల్లా కేంద్రం నరసరావపేటలో దుకాణానికి వెళ్లినా తాగు నీరు ఉన్నా లేకున్నా ఖైని గుట్కా ప్యాకెట్లు మాత్రం కచ్చితంగా దొరుకుతాయి. ఖైని గుట్కా అమ్మకాలు జిల్లా కేంద్రం నరసరావుపేట మారుమూల దుకాణాలతో జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు కూత వేటు దూరంలో ఉన్న దుకాణాలలో సైతం ఖైని గుట్కా అమ్మకాలు చాటు మాటుగా విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులకు తెలిసినా తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి జరిమానాలతో సరిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖైని,గుట్కా ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్య తరగతి మహిళలు సైతం వినియోగించడం ఆందోళన చెందాల్సిన అవసరం ఉంది. నిషేధిత ఖైని గుట్కా మత్తు పదార్థాల వినియోగం వలన నోటి క్యాన్సర్ తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా యువత పెడచెవిన పెడుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపి మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై ఒక పోలీసు ఉన్నతాధికారిని ప్రజాశక్తి వివరణ కోరగా ప్రస్తుతం ఖైని గుట్కాలపై నిషేధం అమలులో లేకపోవడం వలన మేము ఏమి చేయాలేమని సమాధానం ఇచ్చారు. కొన్ని నెలల క్రితం నరసరావుపేట పట్టణ సమీపంలో చిలకలూరిపేట రోడ్డు ఎస్ఆర్.కెటి కాలనీ వద్ద అప్పటి గ్రామీణ ఎస్.ఐ ఈ. బాల నాగిరెడ్డి సిబ్బందితో సాధారణ తనిఖీలలు నిర్వహిస్తుండగా 2 ద్విచక్ర వాహనాలపై వెళుతున్న 5 యువకులు నుండి 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని యువకులపై కేసు నమోదు చేశారు. గంజాయి తరలిస్తున్న 5 గురు యువకులలో 4 విద్యార్థులు ఉండడం గమనార్హం.

సొసైటీలకు ఎన్నికలు జరిగేనా !

ప్రజాశక్తి - పెదకూరపాడు



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీ సభ్యులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. అందుకు సంబంధించి ఉత్తర్వులు సహకార సంఘానికి అందాయి. దీంతో వైసీపీ ప్రభుత్వము హయాంలో నామినేటెడ్ పదవులుగా కొనసాగిన పిఎసిఎస్ లు త్రిసభ్య కమిటీల పదవీకాలం ముగిసినట్లే. మండలంలో తాళ్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఉన్నది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఐదేళ్ల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో త్రిసభ్య కమిటీలను నియమించింది. గత ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు రెన్యువల్ చేయడమో, కొత్త వారికి అవకాశం కల్పించడం ద్వారా ఇన్నాళ్లు కాలం వెలదీస్తూ వచ్చింది. సార్వత్రిక ఎన్నికలు జరిగి ప్రభుత్వ మారడంతో చీఫ్ సెక్రటరీ ఆదేశాలతో నామినేటెడ్ గా నియామకం జరిగిన పాత కమిటీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. త్రిసభ్య కమిటీ సభ్యులు రాజీనామా చేశారు. వారు రాజీనామా చేయటంతో బోర్డు ఖాళీ అయింది. అయితే నామినేటెడ్ గా నియమించిన పాత కమిటీలను రద్దు చేసిన ప్రభుత్వం మళ్లీ అదే బాటలో కొత్త కమిటీలు నియమిస్తుందా లేదా ఎన్నికలకు నిర్వహిస్తారా అని ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు జరగాలంటే ఆ ప్రక్రియకు కొన్నాళ్లు సమయం తీసుకునే అవకాశం ఉంది .ఈ లోగా పాత కమిటీలు రద్దు చేయడంతో పిఎసిఎస్ లు నిర్వహణ బాధ్యత ఎవరు చూస్తారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో వీటి నిర్వహణకు అధికారులకు అప్పగించడం లేకుంటే మళ్ళీ నామినేటెడ్ పదవిలో వేరే వారిని నియమిస్తారో ఎదురు చూడాలి.

కొన్నాళ్లుగా సొసైటీ కమిటీలకు ఎన్నికలు జరగటం లేదు. దీంతో ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పథకాలు సక్రమంగా అందక రైతు సంఘాలు నిర్వీర్మవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ఎన్నికలు జరగకపోవడంతో సంఘ నాయకులు ఆడింది ఆటగా పాడింది పాటగా ఇన్నాళ్లు సాగిపోయిందని విమర్శలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తే సభ్య రైతులు ఎన్నికతో సొసైటీ పగ్గాలు చేపట్టే కొత్త కమిటీలతో సహకార సంఘాలు బలోపేతం అవుతాయని రైతులు ఆశగా చూస్తున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

తాళ్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరాజు అన్నారు. సుమారు 6 సంవత్సరాల నుంచి ఎన్నికలు జరగడం లేదు. దీంతో ఆ వ్యవస్థ సక్రంగా సాగాలంటే ఎన్నికలు నిర్వహిస్తే మంచిదన్నారు. ప్రస్తుతం పిఎసిఎస్ కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వెంటనే కమిటీలు వేయటం గాని, ఎన్నికలుగా నిర్వహించాలని కోరారు. వ్యవసాయ రుణాలు కావాలంటే తప్పనిసరిగా పీఏసీఎస్ ఆమోదం అవసరం ఉంటుందన్నారు.

వృద్ధులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న పరమేశ్వరరెడ్డి

భారతీయ సమాజంలో ఉమ్మడి కుటుం బాల వ్యవస్థ అంతరి ంచిపోతున్న నేపథ్యంలో పిల్లలపై ఆధారపడ్డ వయావద్ధులను అనేక కారణాలతో ఇటీవల వేధించటం బాగా పెరిగిపోయిందని, వారిపై అమానుషంగా దాడిచేసి చంపటం సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునే ఇటువంటి సంఘటనలపై తక్షణం ప్రభుత్వ యంత్రాంగం స్పందించి నిందితులను అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా తక్షణం విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ చాగంరెడ్డి పరమేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి రైల్వే బ్యారెక్స్ వద్ద ఉన్న రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఇటీవల అనంతపురంలో మామపై కోడలు దారుణంగా కొట్టి హింసించిన ఘటనను ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. సభకు జిల్లా అధ్యక్షులు బైసాని కైలాస్‌నాథ్ అధ్యక్షత వహించగా ముఖ్యసలహాదారు వల్లూరి సదాశివరావు మాట్లాడుతూ శతాబ్దాల పాటు విలువలతో కూడిన భారతీయ సమాజంలో వస్తున్న మార్పులు బాధాకరమన్నారు. వయావృద్ధుల అనుభవాలను స్వీకరించి ముందుకు నడిపే సమాజం అభివద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. స్వార్థంతో వయావృద్ధులను వేధించే కుటుంబ సభ్యులు తిరిగి వారికి అటువంటి సంఘటనలే ఎదురు కావచ్చనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు ఎఎంజి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వద్ధుల వేధింపుల చట్టాలను కఠినంగా అమలు చేసేలా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించాలని కోరనున్నట్లు తెలియజేశారు. అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రదర్శనగా స్థానిక బ్రాడీపేట అంబేద్కర్ కూడలి వద్ద బ్యానర్ పట్టుకొని వద్ధులపై వేధింపులు సిగ్గు సిగ్గు, వద్ధులపై దాడులను అరికట్టాలి, వద్ధులను వేధించిన వారిని తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి అంటూ నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంతి ఆర్టీసీ నాయకులు వరప్రసాద్, నాగేందర్‌రెడ్డి, రాంబాబు, కె.కామేశ్వరరావు, మురళీకష్ణమూర్తి, సుబ్బా రావు, చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.